# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సమిష్టి కృషి ఎంతో అవసరమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంలో "జల్ జీవన్ మిషన్" పథకం ఎంతగానో దోహదపడుతుందని దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు.
- గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.

=========================

రాష్ట్రంలో ప్రస్తుతం 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని, మరిన్ని అందుబాటులోకి రానున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి ఈరోజు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ఎల్పీజీ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. ఆసుపత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని సూచించారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఇండక్షన్ స్టవ్‌ల లభ్యత పెరిగేలా చూడాలని, గ్యాస్ కంపెనీలు స్వల్ప కాలికంగా ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

=========================

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి (APEDB) పని చేయాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళగిరిలోని APEDB నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖా మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఉద్యోగాల కల్పన లక్ష్యం చేరుకోవడంలో APEDB పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పనకు రాష్ట్రంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, లక్ష్య సాధన కోసం జిల్లా కలెక్టర్లతో పాటు అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. కింది స్థాయిలో MSME గురించి అవగాహన కల్పించాలని.. ఇందుకోసం కలెక్టర్లతో పాటు అన్ని శాఖల సహకారం తీసుకుని MSMEని పటిష్టం చేయాలన్నారు.

========================

గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అమ్మవలస గ్రామంలో ఈరోజు నిర్వహించిన మెగా పాడి పశువుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుమారు 5 కోట్ల 86 లక్షల రూపాయలతో 902 పశువులను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. పశువుల సంరక్షణ, ఉత్పాదకత పెంపు దృష్ట్యా ప్రభుత్వం 50 శాతం రాయితీతో పశు ఆహారం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా గిరిజన రైతులకు తక్కువ ఖర్చుతో పశుసంపదను అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సంచార ఆరోగ్య కేంద్రాల ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి వివరించారు.

========================

ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంలో కేంద్ర ప్రభుత్వ “జల్ జీవన్ మిషన్” పథకం ఎంతగానో దోహద పడుతోందని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం అన్నారెడ్డి పాలెంలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న జల్ జీవన్ మిషన్ పథకం పనులకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ... ఆత్మకూరు శాసనసభ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ఈ పథకం ద్వారా తాగునీటిని అందిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం మరో రెండు సంవత్సరాల పాటు ఈ పథకాన్ని పొడిగించిందని.. దీంతో గ్రామాలన్నింటికీ తాగునీటి వసతి కలుగుతుందని అన్నారు. అలాగే అన్నారెడ్డి పాలెం గ్రామంలో 36 లక్షల రూపాయలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు.

========================

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని తారక రామానగర్‌లో మండల పరిషత్ ఆదర్శ పాఠశాలను మంత్రి ఈరోజు ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విరామం

========================

ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే `దివ్యాంగ శక్తి` పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఈరోజు పరిశీలించారు. `దివ్యాంగ శక్తి` పథకాన్ని ప్రారంభించి.. అనంతరం దివ్యాంగులతో కలసి మంగళగిరి నుండి ఉండవల్లి వరకు ప్రయాణించే అవకాశాలు, ఏర్పాట్లను వారు తనిఖీ చేశారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ లలో దివ్యాంగ శక్తి పథకం కింద దివ్యాంగులకు ఆయా బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రభుత్వం

కల్పించనుంది. నాన్ స్టాప్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి ఎక్స్ ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ప్రస్తుతం కల్పిస్తున్న 50 శాతం రాయితీ కొనసాగనుంది.

========================

హెచ్ఐవీ నివారణ చర్యలలో భాగంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (NACO) విజయవాడలో రాష్ట్ర స్థాయి `సురక్ష సంకల్ప కార్యశాల`ను నిర్వహించనుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ హెచ్ఐవీ నివారణ చర్యలను బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలను చేపట్టింది. దీనిలో భాగంగా రేపు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సురక్ష సంకల్ప కార్యశాలకు ఎన్ఏసీఓ (NACO) అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా అధ్యక్షత వహించనున్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్, మిషన్ డైరెక్టర్ జి. వీరపాండియన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె. నీలకంఠ రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్లు, అదనపు జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్య అధికారులు, ఎయిడ్స్ నియంత్రణ అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఈ వర్క్ షాప్‌లో 23 జిల్లాల నుంచి కార్యక్రమ బృందాలు పాల్గొని తమ పురోగతిని, సవాళ్లను వివరిస్తాయి. క్షేత్రస్థాయిలో హెచ్ఐవీ నివారణ ప్రచారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తాయి.

========================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయం, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని, గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించారు.

========================

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్నప్పుడే మహిళ సాధికారత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో మహిళలపై నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంతో పోల్చుకుంటే మహిళలు.. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు.

========================
========================